హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

హెల్మెట్ ప్రయాణం సురక్షితం : ఏఎస్పీ

ఏటూరునాగారం, జనవరి 17 : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం సురక్షితమని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బస్టాండు నుంచి వై జంక్షన్ వరకు ద్విచక్ర వాహనాలతో చేపట్టిన ర్యాలీని ఏఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహనదారులకు పోలీసులు హెల్మెట్లను పంపిణీ చేశారు. అనంతరం వై జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎస్పీ మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల భారి నుంచి కాపాడుకునేందుకు యువత హెల్మెట్లు ధరించాలని సూచించారు. మద్యం సేవించిన వారికి పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయకుండా నిరాకరించేలా చూడాలని గ్రామస్తులు పోలీసులకు సూచించారు. చిరు వ్యాపారులు రోడ్డును ఆక్రమించుకుని ఫ్లెక్సీలు, నేమ్ బోర్డులు ఏర్పాటు చేయడం, సామగ్రి రోడ్డుపైనే పెట్టి విక్రయించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని కూడా అదుపు చేయాలని గ్రామస్తులు కోరారు. అదే సమయంలో హెల్మెట్ ధరించి విదేశీ వ్యక్తి ఒకరు ద్విచక్ర వాహనంపై వెళ్లడాన్ని గమనించిన పోలీసులు అతడిని స్టేజీపైకి ఆహ్వానించి మాట్లాడించారు. ఈ సందర్భంగా యువత హెల్మెట్ ధరించి ప్రయాణం చేస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు, ముక్కెర లాలయ్య, శ్రీనివాస్, సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ బ్యాంకింగ్ పరీక్షకు ఉచిత శిక్షణ

భూపాలపల్లి రూరల్, జనవరి 17 : ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ బ్యాంకింగ్ రిక్రూట్ మెంట్ ఫౌండేషన్ కోర్సు కోసం 100 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి టీ శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హత గల అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ ప్రకారం ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు ఉంటుంది, ఫిబ్రవరి 15 నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 0870-2571192, 040-24071178 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మానిటరింగ్ కమిటీ ఎంపికకు దరఖాస్తులు

జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యత్వానికి దరఖాస్తు కోరుతున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్గనైజేషన్, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆసక్తి గల షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 22 సాయంత్రం 5 లోపు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి గారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

వెంకటాపురం(నూగూరు), జనవరి 17 : మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలకేంద్రంలోని శివాలయం వీధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పానెం నవసందీప్ (20) అంగ వైకల్యంతో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి మనో వేదనకు గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా ప్రాథమిక చికిత్స అందించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు వైద్యులు రెఫర్ చేశారు. అక్కడ నుంచి కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

వాజేడు, జనవరి 17 : గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఎడ్జర్లపల్లిలో గుడుంబా అమ్ముతున్నారనే సమచారంతో శుక్రవారం పోలీసు సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి తెల్లని సంచితో పారిపోతుండగా పట్టుకున్నట్లు చెప్పారు. సంచిని పరిశీలించగా రూ.3,200 విలువగల ఎనిమిది లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు గౌరరాపు శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు భద్రత ఏది?

- ములుగు జిల్లాలో జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు
- ఏడాదిలో 170 ఘటనలు
- పర్యాటకులు, భక్తులే బాధితులు
- ఇసుక లారీలతో దెబ్బతిన్న ఎన్‌హెచ్
- కనిపించని నివారణ చర్యలు

ఎర్రిగట్టమ్మ వద్ద ఇసుక లారీతో దెబ్బతిన్న జాతీయ రహదారి

ములుగు, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : పర్యాటక ఖిల్లా ములుగు జిల్లాలో రోడ్డు భద్రత కరువైంది. 163 జాతీయ రహదారి మీదుగా దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలను నిత్యం పర్యాటకులు సందర్శిస్తుంటారు. అంతేకాకుండా ఈ రహదారి గుండా ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో దెబ్బతిన్నది. వాహనదారులకు సరైన అవగాహన లేకపోవడంతో జిల్లాకు చెందిన ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు, భక్తులు నిత్యం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికి తోడు ములుగు జిల్లా కేంద్రంతో పాటు జాతీయ రహదారి వెంట ఉన్న మహ్మద్‌గౌస్‌పల్లి, మల్లంపల్లి, జాకారం, ములుగు, జంగాలపల్లి, జవహర్‌నగర్, మచ్చాపూర్, చల్వాయి, గోవిందరావుపేట, పస్రా, తాడ్వాయి, చిన్నబోయినపల్లి, ఏటూరునాగారం, గుమ్మడిదొడ్డి మీదుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు వరకు ఉన్న గ్రామాల్లో రోడ్డు భద్రతా చర్యలు కానరావడం లేదు. జాతీయ రహదారి వెంట దుకాణాలు, భారీ వాహనాలు పార్కింగ్ చేయడం సైతం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. యూటర్న్‌ల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో పాటు సిగ్నలింగ్ వ్యవస్థ లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

నివారణ చర్యలు ఎన్నడు ?

ములుగు జిల్లా ఏర్పడి ఆరేండ్లు పూర్తవుతున్నా పోలీస్ శాఖ ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడం సైతం ఇందుకు కారణమవుతున్నది. ముఖ్యంగా ములుగు జిల్లా కేంద్రంలో ఆరు కిలో మీటర్ల మేర జాతీయ రహదారి వెంట కేవలం ఎనిమిది ప్రాంతాల్లో యూటర్న్‌లు ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కార్యాలయాలు, దుకాణాలకు వెళ్లేందుకు ప్రజలు కిలో మీటర్ దూరంలో ఉన్న యూటర్న్‌ల వద్దకు వెళ్లకుండా రాంగ్ రూట్‌లో ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన పోలీస్ అధికారులు వాహనాలను ఫొటోలు తీసి జరిమానాలు వేస్తున్నారే తప్పా ట్రాఫిక్ పోలీసింగ్ వ్యవస్థను అమలు చేయడం లేదు. అంతేకాకుడా జిల్లాకు వచ్చే పర్యాటకులు, ఇసుక లారీల డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. జాతీయ రహదారికి 500 మీటర్ల దూరంలో మద్యం విక్రయాలు జరుపాలనే నిబంధనలు ఉన్నప్పటికీ ఎక్సైజ్, పోలీస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మల్లంపల్లి, ములుగు, జంగాలపల్లి గ్రామాల్లో నాలుగు మద్యం దుకాణాలు ఉన్నాయి. దీంతో వాహనదారులు జాతీయ రహదారి పక్కనే వాహనాలను నిలిపి మద్యం కొనుగోలు చేసి వాహనాల్లోనే తాగుతూ వెళ్తున్నారు. అంతేకాకుండా రహదారి వెంట ఉన్న అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులు ఉండడంతో మద్యం నియంత్రణ లేక రోడ్డు ప్రమాదాలు పెరుగుతూ వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టకపోతే మీని మేడారం ముగిసే సమయానికి మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

సంవత్సర కాలంగా 170 రోడ్డు ప్రమాదాలు

ములుగు జిల్లాలో 2024 జనవరి నుంచి డిసెంబర్ 31 వరకు 161, 2025 జనవరి ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 170 ప్రమాదాలు జరిగి 28 మంది మృతి చెందారు. జిల్లాలో 13 ప్రాంతాల్లో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా పోలీసులు వాటిని బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ ప్రతీ రోజు ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు ప్రమాదం కేసులు నమోదువుతున్నాయి. గత వారం రోజులుగా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో బుధవారం జంగాలపల్లి వద్ద ప్రభుత్వ వాహనం ఢీకొన్న సంఘటనలో ముగ్గురు గాయపడి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఇది మరువక ముందే గురువారం రెండు ప్రమాదాలు చోటు చేసుకోగా ఒక ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ప్రమాదంలో 13 మంది మేడారానికి వెళ్లి వస్తూ తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ రెండు సంఘటనలు మరిచిపోక ముందే శుక్రవారం గోవిందరావుపేట మండలం చల్వాయి -మచ్చాపూర్ గ్రామాల మధ్య ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పత్తిచేను లోకి దూసుకెళ్లడంతో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి.

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ
- సబ్ కలెక్టర్‌తో కలిసి పరిశీలన

సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

కాటారం, జనవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు సిద్ధం చేసిన నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపిక సర్వేలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా పారదర్శకంగా నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని కొత్తపల్లిలో జరుగుతున్న సర్వే ప్రక్రియను సబ్ కలెక్టర్ మయాక్ సింగ్‌తో కలిసి తనిఖీ చేశారు. లబ్ధిదారుల నమోదు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన నాలుగు పథకాల అమలుకు జిల్లాలో సర్వే ప్రక్రియ ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలిపారు. సర్వేలో భాగంగా పర్యవేక్షణకు అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించామని, విచారణ బృందం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వ్యవసాయ యోగ్యమైన, వ్యవసాయానికి పనికి రాని భూముల వివరాలు పక్కాగా సేకరిస్తున్నారని తెలిపారు. సర్వే బృందాలకు ప్రజలు సహకరించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో విచారణ పూర్తి చేసి గ్రామ సభల్లో జాబితాను ప్రదర్శించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వే తీరును పరిశీలించిన కలెక్టర్ సిబ్బందిని అభినందించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరవుతాయన్నారు. ఒకవేళ జాబితాలో పేర్లు లేని కుటుంబాలు సర్వే అధికారి వద్ద మళ్లీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సర్వేలో ఏమైనా సమస్యలు వస్తున్నాయా? వస్తే ఆ కారణాలను కూడా పొందుపర్చాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, డీటీ రామ్మోహన్, ఏఈవో దివ్య జ్యోతి, కార్యదర్శి జ్యోత్స్న పాల్గొన్నారు. అలాగే మండలంలోని కొత్తపల్లి, చిదినెపల్లి, ధన్వాడ, ఒడిపిలవంచ, గంగారం, దామెరకుంట గ్రామ పంచాయతీల్లో డీఆర్‌డీవో నరేశ్ క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ధన్వాడ, కొత్తపల్లి గ్రామాలలో ఆయన విచారణను తనిఖీ చేశారు. ఎక్కడ కూడా పొరబాట్లు జరగకుండా సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాబు, డీటీ రాంమ్మోహన్, ఎంపీవో వీరస్వామి, ఆర్ఐ వెంకన్న, ఏవో పూర్ణిమ, ఏఈవోలు, కార్యదర్శులు, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

టేకుమట్ల/ మొగుళ్లపల్లి, జనవరి 17 : టేకుమట్ల మండలం అంకుషాపూర్, మొగుళ్లపల్లి మండలం కొర్కిశాల, ముల్కలపల్లి, మొగుళ్లపల్లి గ్రామాల్లో చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికపై జరుగుతున్న సర్వేను శుక్రవారం అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పరిశీలించారు. సర్వేను ఎలాంటి తప్పులు లేకుండా గడువు లోగా పూర్తి చేయాలని సర్వే అధికారులను ఆదేశించి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, టేకుమట్ల తహసీల్దార్ విజలక్ష్మి, ఎంపీడీవో అనిత, ఆర్ఐ సంతోష్ , పంచాయతీ కార్యదర్శి నరేశ్, ఏఈవో భరత్ కుమార్, టీఏ వినీల, వినయ్‌సాగర్, మొగుళ్లపల్లి తహసీల్దార్ సునీత, ఆర్ఐ సురేందర్‌రెడ్డి, వ్యవసాయాధికారి సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ ఉండదు : ఎస్పీ

భూపాలపల్లి రూరల్, జనవరి 17 : ఇటీవల డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదని, ప్రజలు ఎవరూ నమ్మొద్దని ఎస్పీ కిరణ్ ఖరే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరగాళ్లు లాటరీలు, రివార్డులు, జాబ్స్ , కమీషన్లు, డిస్కౌంట్లు, వివిధ రకాల పేరుతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని ఆశ చూపి మోసం చేస్తున్నారన్నారు. మొబైల్‌కు వచ్చిన ఓటీపీ ఎవరికి చెప్పొద్దని, అనవసర సమయాల్లో ఇంటర్నెట్ ఆఫ్ చేయడం మంచిదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపిన లింకులను క్లిక్ చేయొద్దని, అధికారిక వెబ్ సైట్లను మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. వెంటనే పోలీసులను ఆశ్రయించాలని ఎస్పీ కోరారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గణపురం,జనవరి 17: మండలంలోని ఓసీ-3 ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామ ప్రజలకు రేమెడియేషన్ మేజర్స్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం రాజేశ్వర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 ఉదయం 8 గంటల నుంచి నగరంపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నిపుణులైన సింగరేణి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు 2డీ-ఎకో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. నగరంపల్లె, కొండంపల్లి, ధర్మారావుపేట పరిసర గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ముగిసిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు

భూపాలపల్లి రూరల్, జనవరి 17 : జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఈవో రాజేందర్ తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని డీఈవో సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఉదయం నిర్వహించిన డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 83 మంది, సాయంత్రం నిర్వహించిన డ్రాయింగ్ హయ్యర్ పరీక్షకు 44 మంది హాజరయ్యారన్నారు. ఆయన వెంట ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మండల రవీందర్‌రెడ్డి, ఏఎంవో కాగితం లక్ష్మణ్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ దుప్పటి రాజగోపాల్, చీఫ్ సూపరింటెండెంట్ కే సరోత్తంరెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారి కుసుమ కృష్ణమోహన్, సిట్టింగ్ స్క్వాడ్ డీటీ పంతంగి భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ గౌసుద్దీన్ ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ములుగురూరల్, జనవరి 17 : ములుగు మండలం కొత్తూరులో వారం రోజుల పాటు జరిగిన జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. మొత్తం 31 జట్లు పాల్గొనగా నర్సంపేట జట్టు మొదటి బహుమతి, తాడ్వాయి జట్టు ద్వితీయ బహుమతి సొంతం చేసుకున్నాయి. ముఖ్య అతిథులుగా జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్, జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ హాజరై విజేతగా నిలిచిన జట్లకు ట్రోఫీలను అందజేశారు. అనంతరం క్రికెట్ పోటీలను నిర్వహించిన ఎన్ఆర్ఐ నితిన్‌రావును ప్రవీణ్, భిక్షపతి వారు సన్మానించారు.

20న సదరం క్యాంపు

కృష్ణకాలనీ, జనవరి 17: జిల్లాలోని అన్ని మండలాలతో పాటు భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దివ్యాంగులకు ఈనెల 20న 100 పడకల ఆసుపత్రిలో సదరం క్యాంపు నిర్వహిస్తునట్లు డీఆర్డీవో నరేశ్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులతో పాటు రెన్యూవెల్ చేసుకునేవారు మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్నవారు మాత్రమే సదరం క్యాంపునకు హాజరుకావాలని, గతంలో తిరస్కరించిన వారికి అవకాశం లేదన్నారు.

ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం మొండి వైఖరి వీడాలి

భూపాలపల్లి రూరల్, జనవరి 17 : లారీ ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం మొండి వైఖరి వీడి, మెయింటనెన్స్ చార్జీలు పెంచాలని భూపాలపల్లి లారీ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల చంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని భూపాలపల్లి, గణపురం లారీ అసోసియేషన్ సభ్యులు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేయగా ఆయన మాట్లాడారు. రవాణా మెయింటనెన్స్ చార్జీలు పెంచాలని కోరుతూ జనవరి 10 నుంచి లారీల సమ్మె చేస్తున్నామని, ఇప్పటి వరకు లారీ ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం, అధికారులు స్పందించడంలేన్నారు. 2023 నుంచి రవాణా మెయింటనెన్స్ చార్జీలు పెంచడం పోవడంతో లారీ ఓనర్లు కిస్తీలు కట్టలేక అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, మూడు నెలల్లోనే నలుగురు లారీ ఓనర్లు చనిపోయారని తెలిపారు. వారి పిల్లలకు ఆర్థిక సాయం అందించడం కోసం చందాలు వేసుకొని రూ. 2లక్షల చొప్పున ఎల్ఐసీ బాండ్లను అందజేశామని తెలిపారు. వెంటనే సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకపోతే భూపాలపల్లి ఏరియా నుంచి ఒక్క బొగ్గు పెల్ల బయటకు పోకుండా అడ్డుకుంటామని, జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. గణపురం లారీ అసోసియేషన్ అధ్యక్షుడు జగ్గారావు, గౌరవ అధ్యక్షుడు శ్రీరాములు, టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షులు పుట్ట రవి, ఎండీ అన్వర్ పాషా, కౌటం సురేందర్, ఎనగంటి రమేశ్, తిరుపతిరావు, రొడ్డ రవి, బాల్ చందునాయక్ పాల్గొన్నారు.

మినీ జాతరకు భారీ బందోబస్తు

తాడ్వాయి, జనవరి 17: మేడారం మినీ జాతరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ శబరీష్ తెలిపారు. జాతర సమీపిస్తున్నందున శుక్రవారం ఆయన మేడారంలో పర్యటించారు. నాలుగు వైపులా పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గద్దెల వద్ద భక్తులు తల్లులను సులువుగా దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాల నివారణకు జాతర పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు పోలీస్ అధికారులతో చర్చించారు.

గుడుంబా తయారీదారులపై కేసు

వెంకటాపూర్, జనవరి 17 : మండలంలోని నల్లగుంట, మల్లయ్యపల్లి గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు, జిల్లా టాస్క్‌ఫోర్స్ భూపాలపల్లి, వెంకటాపూర్ పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి నలుగురిపై కేసు నమోదు చేసినట్లుఎక్సైజ్ సీఐ సుధీర్‌కుమార్ తెలిపారు. 1200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

చిట్యాలలో..

చిట్యాల : మండలంలోని లక్ష్మీపూర్ తండా, పాశిగడ్డతండాల్లోని గుడుంబా స్థావరాలపై శుక్రవారం ఎక్సైజ్, పోలీసులు సామూహిక దాడులు నిర్వహించారు. 10 లీటర్ల గుడుంబా, 35 కిలోల చెక్కర, 4 కిలోల పటిక స్వాధీనం చేసుకొని, 1,800 లీటర్ల చెక్కర పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రబ్బానీ, ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. దాడుల్లో మూడు కేసులు నమోదు చేసి, నిర్వాహకురాలిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

గోవిందరావుపేట, జనవరి 17 : విదేశీ విద్యను అభ్యసించే విద్యార్థులకు అందించే ఓవర్సీస్ పథకానికి సంబంధించిన పెండింగ్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ గోవింద్‌నాయక్ అన్నారు. గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహారావు అధ్యక్షతన చల్వాయిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ.40వేల కోట్లను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పూర్ణచందర్, మాజీ సర్పంచ్ సమ్మయ్య, నాయకులు శ్రీను, ప్రసాద్, భద్రయ్య, జ్యోతి, మంజూల, రఘు, రాజు, వినోద, శ్రీను, కనకయ్య పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

టేకుమట్ల, జనవరి 17 : టేకుమట్ల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన దాసరి సుధాకర్‌ను బీఆర్ఎస్ మండల నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్మిక శాఖ మండల అధ్యక్షుడు నేరెళ్ల రామకృష్ణగౌడ్, మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, ప్రధాన కార్యదర్శి ఆకునూరు తిరుపతి, మాజీ ఎంపీటీసీ పింగిలి వెంకటేశ్వర్‌రెడ్డి, ఆది రఘు, మాజీ ఎంపీపీ బందెల నరేశ్, మాజీ సర్పంచులు ఉద్దమారి మహేశ్, పొన్నం చంద్రయ్య, నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్, చదువు మహేందర్‌రెడ్డి, మారం లింగారెడ్డి, టేకుమట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు నిమ్మల స్వామి నాయకులు పాల్గొన్నారు.

దండేపల్లిలో కార్డన్ సెర్చ్

మహాముత్తారం, జనవరి 17: మండలంలోని సింగారం గ్రామ పంచాయతీ పరిధి దండేపల్లి గొత్తికోయ గుంపులో ఎస్సై మహేందర్‌కుమార్ కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కొత్తగా, అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మావోయిస్టులకు సహకరించొద్దని, వారి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసుకుల చెప్పాలన్నారు.

అక్రమ ఇండ్ల నిర్మాణ పనుల అడ్డగింత

కాటారం, జనవరి 17 : మండలంలోని రేగులగూడెం జీపీ పరిధి గంగారం క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా నిర్మిస్తున్న ఇండ్ల పనులను పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇండ్ల యజమానులకు పలుమార్లు నోటీసులు జారీ చేసినా పట్టించుకోక పోవడంతో ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది శుక్రవారం నిర్మాణ పనిముట్లను జీపీ కార్యాలయానికి తరలించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

ములుగురూరల్, జనవరి 17 : జిల్లాలోని అన్ని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ కార్యాలయంలో అన్ని మండలాల ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ముందుగా గ్రంథాలయాలకు కావాల్సిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి సీతక్కతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం అభివృద్ధి పనుల్లో భాగంగా మరుగుదొడ్ల పనులు ప్రారంభించారు.

నేడు డయల్ యువర్ డీఎం

ములుగురూరల్/ కృష్ణకాలనీ, జనవరి 17 : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్-2డిపో మేనేజర్ వీ జోత్స్న, భూపాలపల